మెగా ప్రయోగం?

చిరంజీవి సినిమా అంటే.. అందమైన ఇద్దరు హీరోయిన్లుండాలి. అదిరిపోయే బీట్ ఉన్న పాటలుండాలి. అదరహో అనిపించే స్టెప్పులుండాలి. మెగా టైమింగ్‌కి తగ్గట్టు డైలాగులుండాలి.. ఈవన్నీ ఉంటేనే అది చిరంజీవి సినిమా. కానీ మెగాస్టార్ ఇవేమీ లేకుండా ప్రయోగాత్మక సాహసానికి సిద్ధమవుతున్నారని సమాచారం. ప్రస్తుతం చిరంజీవి 'విశ్వంభర' చేస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమా మే 9న విడుదల కానుంది. ఆ తర్వాత అనిల్ రావిపూడి సినిమా ఉంటుంది. ఆ తర్వాత 'దసరా'ఫేం శ్రీకాంత్ ఓదెల సినిమా చేస్తారు చిరంజీవి. ఈ సినిమా విషయంలోనే చిరంజీవి ప్రయోగం చేయనున్నారని తెలుస్తున్నది. ఈ సినిమా కమల్‌హాసన్ 'విక్రమ్' తరహాలో ఉంటుందట. ఇందులో ఫైట్లు తప్ప డాన్సులు, హీరోయిన్లతో ఆటపాటలు, కామెడీ ఇలాంటివేం ఉండవంట. చిరు క్యారెక్టర్ చాలా ఇంటెన్స్‌గా ఉంటుందని, మెగా అభిమానులు పండుగ చేసుకునేలా క్యారెక్టరైజేషన్ ఉంటుందని సమాచారం.

అందాల రాక్షసి

ఇండస్ట్రీలో 90శాతం సక్సెస్ రేట్ ఉన్న కథానాయిక సంయుక్త మీనన్. రాశి కన్నా వాసి ముఖ్యమన్నట్టు ఆచితూచి సినిమాలను ఎంచుకుంటూ ముందుకెళ్తున్నది ఈ మలయాళ మందారం. ప్రస్తుతం సౌత్‌లో అన్ని భాషలూ కలిపి ఓ అరడజను సినిమాలు ఈ అమ్మాయి చేతిలో ఉన్నాయి. ఇదిలావుంటే.. ఇటీవలే ఓ తెలుగు సినిమాకు ఈ ముద్దుగుమ్మ పచ్చజెండా ఊపేసిందట. పైగా అది లేడీ ఓరియెంటెడ్ సినిమా అని సమాచారం. రాజేష్ దండా నిర్మిస్తున్న ఈ చిత్రానికి యోగి దర్శకుడు. ఈ సినిమాకు 'రాక్షసి' అనే టైటిల్‌ని అనుకుంటున్నారట. ఫిల్మ్ ఛాంబర్‌లో ఈ టైటిల్‌ని రిజిస్టర్ కూడా చేయించినట్టు తెలుస్తున్నది. ఇందులో సంయుక్త పోలీస్ ఆఫీసర్‌గా కనిపించనుందని వినికిడి. పేరుకు తగ్గట్టే వైల్డ్‌గా ఈ పాత్ర బిహేవ్ చేస్తుందట. అందుకే ఈ కథకు 'రాక్షసి' అనే టైటిల్ అనుకుంటున్నారు. ఈ సినిమా నిర్మాణంలో కూడా సంయుక్త భాగస్వామిగా ఉంటారని తెలుస్తున్నది.

అలా మొదలైన ప్రేమ

ఇటీవలే యువ హీరో నాగచైతన్యతో వివాహబంధంలోకి అడుగుపెట్టింది శోభితా ధూళిపాళ్ల. పెళ్లి తర్వాత దంపతులిద్దరూ కలిసి ఓ జాతీయ పత్రికకు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా చైతన్యతో తన పరిచయం, ప్రేమ, పెళ్లికి సంబంధించిన ఆసక్తికరమైన విషయాలను శోభితా ధూళిపాళ్ల పంచుకుంది. రెండేళ్ల క్రితం చైతన్యతో తన స్నేహం మొదలైందని, 2022 ఏప్రిల్ నుంచి నాగచైతన్యను ఇన్‌స్టాలో ఫాలో అవుతున్నట్లు శోభితా తెలిపింది. తామిద్దరం భోజనప్రియులమని, పరిచయమైన తొలిరోజుల్లో ఎక్కువగా ఫుడ్ గురించే మాట్లాకునేవాళ్లమని చెప్పింది. చైతన్యకు తెలుగులో మాట్లాడటమంటే చాలా ఇష్టమని, తరచూ తనను తెలుగులో మాట్లాడమని కోరేవాడని శోభిత గుర్తు చేసుకుంది. 'నేను సోషల్‌మీడియాలో యాక్టివ్‌గా ఉంటా. నా గ్లామర్ ఫొటోలతో పాటు స్ఫూర్తినిచ్చే స్టోరీలకు చైతన్య లైక్ కొట్టేవాడు. మేమిద్దరం తొలిసారి ముంబయిలోని ఓ కేఫ్‌లో కలుసుకున్నాం. ఆ తర్వాత కొన్నాళ్లకు కర్ణాటకలోని ఓ పార్క్‌కు వెళ్లాం. ఆ తర్వాత అమెజాన్ ప్రైమ్ ఈవెంట్‌కు వెళ్లాం. అక్కడి నుంచి మా బంధం బలపడింది' అని శోభితా ధూళిపాళ్ల తెలిపింది. ఇరు కుటుంబాల మధ్య సన్నిహిత సంబంధాలు ఏర్పడిన తర్వాత ఈ ఏడాది గోవాలో పెళ్లి ప్రపోజల్ తీసుకొచ్చానని, చైతూ వెంటనే అంగీకరించాడని ఆమె పేర్కొంది.

మూర్ఖపు నిర్ణయాల పర్యవసానం

'సింగిల్ సిట్టింగ్‌తో ఓకే అయిన స్క్రిప్ట్ ఇది. కామెడీ తప్ప అన్ని వేరియేషన్సూ నా పాత్రలో ఉంటాయి. 'నాంది' తర్వాత డిఫరెంట్ సినిమాలు చేయాలనుకున్నాను. అలాంటి సమయంలో దొరికిన కథ ఇది.' అని అల్లరి నరేశ్ అన్నారు. ఆయన కథానాయకుడిగా రూపొందిన చిత్రం 'బచ్చల మల్లి'. సుబ్బు మంగాదేవి దర్శకుడు. రాజేష్ దండా, బాలాజీ గుత్తా నిర్మాతలు. ఈ నెల 20న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో విలేకరులతో ముచ్చటించారు. 'గమ్యం'లో గాలిశీను ఎలా గుర్తుండిపోయాడో, బచ్చల మల్లి కూడా అలా పదేళ్లపాటు గర్తుండిపోతాడని, ఈ క్యారెక్టర్ ఇంపాక్ట్ ఓ రేంజ్‌లో ఉంటుందని అల్లరి నరేశ్ చెప్పారు. ఇంకా మాట్లాడుతూ 'బచ్చల మల్లి అనేది నిజజీవిత పాత్ర. తను ఇప్పటికీ ఉన్నాడు. ఊళ్లో గొడవలన్నీ తన గొడవలుగా ఫీలై, అందరితో మాటలు పడుతూ, దెబ్బలు తింటూ తిరిగే మనిషి తను. అతని జీవితంలోని మూడు సంఘటనలను తీసుకొని వాటి ఆధారంగా ఓ కొత్త సబ్జెక్ట్‌ని తయారు చేశారు సుబ్బు. మూర్ఖత్వంతో తీసుకునే తొందరపాటు నిర్ణయాల పర్యవసానం ఎలా ఉంటుందో ఇందులో చూపించాం. ప్రతి ఒక్కరూ రిలేట్ చేసుకునేలా నా పాత్ర ఉంటుంది. ఇందులో చక్కని మెసేజ్ కూడా ఉంది' అని పేర్కొన్నారు. 1995 నుంచి 2005 వరకూ పదేళ్ల వ్యవధిలో జరిగిన కథ ఇదని, ఇందులో ట్రాక్టర్ డ్రైవర్‌గా కనిపిస్తానని, కావేరీ అనే అమ్మాయి బచ్చలమల్లి జీవితంలోకి ప్రవేశించాక అతని జీవితం ఎలాంటి మలుపు తీసుకుంది? అనేది ఇందులో ఆసక్తికరమైన అంశమని, సుబ్బు దర్శకత్వం, విశాల్ శేఖర్ సంగీతం, రిచర్డ్ ఎం.నాథన్ కెమెరా పనితనం, రాజేష్ దండా నిర్మాణ విలువలు ఈ సినిమాకు ప్రధాన బలాలని అల్లరి నరేశ్ చెప్పారు.

డెకాయిట్‌కి జోడీ కుదిరింది

అడివి శేష్ కథానాయకుడిగా రూపొందుతోన్న పాన్ ఇండియా యాక్షన్ డ్రామా 'డకాయిట్'. షనైల్ డియో దర్శకత్వంలో సుప్రియ యార్లగడ్డ ఈచిత్రాన్ని నిర్మిస్తున్నారు. సునీల్ నారంగ్ సహ నిర్మాత. తెలుగు, హిందీ భాషల్లో ఏకకాలంలో చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ చిత్రానికి అడివి శేష్, షానీల్ డియో కలిసి కథ, స్క్రీన్‌ప్లే అందించారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతున్నది. తర్వాత మహారాష్ట్రలో లాంగ్ షెడ్యూల్ ఉంటుంది. మంగళవారం అడివి శేష్ పుట్టిన రోజు సందర్భంగా 'డెకాయిట్' వరల్డ్‌లోకి కథానాయిక మృణాల్ ఠాకూర్‌ని స్వాగతిస్తూ, అడివి శేష్, మృణాల్ ఠాకూర్ పాత్రల మధ్య కెమిస్ట్రీని ప్రజెంట్ చేస్తూ రెండు పోస్టర్లని మేకర్స్ విడుదల చేశారు. తనకు ద్రోహం చేసిన తన ఎక్స్ లవర్‌పై ప్రతీకారం తీర్చుకునే వ్యక్తి కథగా 'డెకాయిట్' రూపొందుతున్నదని, మనసులకు హత్తుకునే ప్రేమకథతో కూడిన ఉద్వేగపూరిత యాక్షన్ ఎంటర్టైనర్ ఇదని, మృణాల్ తన కెరీర్‌లోనే ప్రత్యేకమైన పాత్ర చేస్తున్నదని అడివి శేష్ తెలిపారు. 'డెకాయిట్'లో భాగం అవుతున్నందుకు మృణాళ్ ఠాకూర్ ఆనందం వెలిబుచ్చింది. ఇందులో అడివి శేష్, మృణాల్ పాత్రలు విలక్షణంగా ఉంటాయని దర్శకుడు తెలిపారు. ఈ చిత్రానికి సమర్పణ: అన్నపూర్ణ స్టూడియోస్.

అంచనాలన్నీ నిజమయ్యాయి

'ఈ సినిమాతో నాది రెండేళ్ల ప్రయాణం. దీనికి పార్ట్-2 కూడా ఉంటుంది. ఇదే టీం నుంచి మరో మంచి చిత్రంతో మీ ముందు కొస్తాం. మరో హిట్ కొడతాం' అన్నారు రాకింగ్ రాకేష్. ఆయన హీరోగా గరుడవేగ అంజి దర్శకత్వంలో రూపొందిన 'కేశవ చంద్ర రమావత్' (కేసీఆర్) చిత్రం ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది. మంగళవారం సక్సెస్‌మీట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా రాకింగ్ రాకేష్ మాట్లాడుతూ 'ఈ సినిమా విషయంలో మా అంచనాలన్నీ నిజమయ్యాయి. దర్శకుడు అంజి అన్న నేను తలెత్తుకునేలా సినిమా తీశాడు. నా భార్య సుజాత ఎంతో ధైర్యాన్నిచ్చింది. ఈ సినిమాలో నటించిన నటీనటులు, సాంకేతిక నిపుణులందరికీ రుణపడి ఉంటాను. ఈ సినిమాకు తప్పకుండా అవార్డ్స్ వస్తాయి. అప్పుడు గొప్ప పండగ చేసుకుంటాం. ఈ సినిమా 'ఆహా' ఓటీటీలో స్ట్రీమింగ్ కానుంది' అన్నారు. అభిమానులు విజిల్స్ వేసే మాస్ సినిమా చేయాలనే కోరిక ఈ సినిమాతో తీరిందని సంగీత దర్శకుడు చరణ్‌అర్జున్ ఆనందం వ్యక్తం చేశారు. ఈ సినిమా సక్సెస్‌ఫుల్‌గా నాలుగోవారంలోకి అడుగుపెట్టడం ఆనందంగా ఉందని, టీమ్ సమిష్టి కృషి వల్లే ఈ విజయం సాధ్యమైందని దర్శకుడు గరుడవేగ అంజి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.

మానవ గాత్రంతోనే అది సాధ్యం!

స్వరకర్తగా, గాయకుడిగా తెలుగు ప్రేక్షకులకు సుపరిచితుడు రమణ గోగుల. కెరీర్‌లో ఎన్నో సూపర్‌హిట్ ఆల్బమ్స్ అందించిన ఆయన గత కొన్నేళ్లుగా ఇండస్ట్రీకి దూరంగా ఉంటున్నారు. సుదీర్ఘ విరామం తర్వాత ఆయన 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాలో 'గోదారి గట్టు..' అనే గీతాన్ని ఆలపించారు. ఈ పాట మ్యూజిక్ చార్ట్స్‌లో అగ్రభాగాన కొనసాగుతున్నది. ఇప్పటికే 27 మిలియన్ల వ్యూస్‌ను దక్కించుకుంది. వెంకటేష్ కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందిన 'సంక్రాంతికి వస్తున్నాం' జనవరి 14న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా రమణ గోగుల పాత్రికేయులతో ముచ్చటిస్తూ 'నేను యూఎస్‌లో ఉంటున్నా. వ్యక్తిగత జీవితంలో బిజీ కావడం వల్ల ఇండస్ట్రీకి దూరంగా ఉన్నా. నేను యూఎస్‌లో ఉన్నప్పుడు చిత్ర సంగీత దర్శకుడు భీమ్స్ కాల్ చేసి తప్పకుండా పాట పాడాలని కోరాడు. సాంగ్ పంపిస్తే రెండుసార్లు విన్నా. చాలా బాగా నచ్చింది. అందులో కొత్తదనంతో పాటు మంచి ఫీల్ ఉందనిపించింది. దాంతో తప్పకుండా పాడాలని నిర్ణయించుకున్నా' అన్నారు. చాలా మంది ఫోన్ చేసి పాట బాగుందని, వాయిస్‌లో అదే మ్యాజిక్ ఉందని పొగడటం ఆనందంగా ఉందని, వెంకటేష్ కూడా ఫోన్ చేసి పాట గురించి మెచ్చుకున్నారని రమణ గోగుల తెలిపారు. మళ్లీ మ్యూజిక్ డైరెక్షన్ చేయడానికి సిద్ధంగా ఉన్నానని, తన వద్ద వినూత్నమైన ఐడియాస్ ఉన్నాయని, మంచి కథ, దర్శకుడు కాంబినేషన్ సెట్ అయితే తప్పకుండా కంపోజింగ్‌కు సిద్ధంగా ఉన్నానని ఆయన పేర్కొన్నారు. టెక్నాలజీ వల్ల మ్యూజిక్ కంపోజింగ్‌లో మార్పులొచ్చాయని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో సింగర్ అవసరం లేకుండా పాటను తయారుచేయొచ్చని, అయితే పాట తాలూకు ఆత్మ ఆవిష్కృతం కావాలంటే మానవ గాత్రంతోనే సాధ్యమని రమణ గోగుల అభిప్రాయపడ్డారు. విదేశాల్లో మల్టీనేషనల్ కంపెనీల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డాటా ఎనలిటిక్స్ ప్రాజెక్ట్స్‌లో బిజీగా ఉండటం వల్ల సినిమాలకు గ్యాప్ వచ్చిందని ఆయన వివరించారు.

కిరణ్ అబ్బవరం KA10

'క' సినిమాతో బ్లాక్‌బస్టర్ హిట్ అందుకున్నారు కిరణ్ అబ్బవరం. ఆ సినిమా ఇచ్చిన ఉత్సాహంతో కొత్త సినిమాను అనౌన్స్ చేయబోతున్నారాయన. విశ్వక రుణ్ ఈ సినిమా ద్వారా దర్శకునిగా పరిచయం కానున్నారు. 'కెఎ 10' వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని శివమ్ సెల్యులాయిడ్ ప్రొడక్షన్స్, ఏ యూడ్లీ ఫిల్మ్స్ కలిసి నిర్మిస్తున్నాయి. ఈ నెల 19న ఈ సినిమా టైటిల్‌ను ప్రకటించనున్నట్లు మేకర్స్ తెలిపారు. ఈ సినిమా కిరణ్ అబ్బవరం కెరీర్‌లో మరో మైలురాయిలా నిలుస్తుందని, భారీ వ్యయంతో ఈ సినిమా నిర్మిస్తున్నామని, ఇందులో నటించే ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో తెలియజేస్తామని మేకర్స్ చెప్పారు.

పుట్టినరోజు కానుకలు

ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ పీపుల్‌మీడియా ఫ్యాక్టరీ కన్నడ సినీరంగంలోకి అడుగుపెట్టనుంది. నటుడు శ్రీమురళి హీరోగా కన్నడంలో టి.విశ్వప్రసాద్ ఓ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇది పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మిస్తున్న 47వ చిత్రం కావడం విశేషం. శ్రీమురళి పుట్టిన రోజు సందర్భంగా ఈ సినిమాకు సంబంధించిన అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఈ సినిమా టైటిల్, దర్శకుడు, నటీనటులు, ఇతర సిబ్బంది.. తదితర విషయాలన్నీ త్వరలో తెలియజేస్తామని మేకర్స్ తెలిపారు. ఇదిలావుంటే.. శ్రీమురళి హీరోగా 'పరాక్' పేరుతో మరో సినిమా రూపొందనుంది. బ్రాండ్ స్టూడియోస్ పతాకంపై హాలేష్ కోగుండి టీమ్ ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. మార్చిలో సినిమా సెట్స్‌కి వెళ్లనుంది. ఈ సందర్భంగా బ్రాండ్ స్టూడియోస్ టీమ్ ఓ పోస్టర్‌ని కూడా విడుదల చేశారు. ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని విశేషాలు త్వరలో తెలియజేస్తామని వారు చెప్పారు.

ఓవర్ థింకింగ్ నేపథ్యంలో..

షణ్ముఖ్ జస్వంత్ లీడ్‌రోల్ చేస్తున్న ఫీల్‌గుడ్ ఎంటర్టైనర్ 'లీలావినోదం'. పవన్ సుంకర దర్శకుడు. శ్రీధర్ మారిసా నిర్మాత. ఈ నెల 19న ఈ సినిమా ఈటీవీ విన్‌లో స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో ఈ సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్‌ని నిర్వహించారు. సినిమాలో అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు హీరో షణ్ముఖ్ జస్వంత్ కృతజ్ఞతలు తెలిపారు. ఓవర్ థింకింగ్ అనే కాన్సెప్ట్ చుట్టూ ఈ సినిమా తిరుగుతుందని, ఆడియన్స్ సర్‌ప్రైజ్ అయ్యే అంశాలు ఇందులో చాలా ఉంటాయని, అద్భుతమైన ఫీల్ ఉన్న సినిమా ఇదని దర్శకుడు చెప్పారు. ఇంకా చిత్ర యూనిట్ సభ్యులందరూ మాట్లాడారు. అనగ అజిత్, గోపరాజు రమణ, ఆమని, రూపలక్ష్మి తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి నిర్మాణం: శ్రీ అక్కియన్ ఆర్ట్స్.

కన్నతండ్రి కోపమే కథకు ఆయువుపట్టుగా

హాలీవుడ్ యాక్షన్ డ్రామా 'క్రావెన్ : ది హంటర్' ఇంకో రెండు వారాల్లో థియేటర్లలో విడుదల కానుంది. సోనీ సంస్థ నుంచి వస్తున్న సూపర్‌హీరో సినిమాల్లో ఇది కూడా ఒకటి. ఈ సినిమా గురించి దర్శకుడు చందూర్ మాట్లాడుతూ 'ఇందులో ముఖ్యమైన పాత్ర పేరు సెర్గీ. చెడ్డవాడైన తన ఇద్దరు పిల్లల్నీ అతడు చంపేస్తాడు. ఆ కోపమే ఈ కథకు ఆయువుపట్టు. ఆద్యంతం యాక్షన్ ఎలిమెంట్స్‌తో అలరించే సినిమా ఇది.' అని తెలిపారు. అరియానా డీబోస్, ఫ్రెడ్ హెచ్చింగర్, అలెసాండ్రో నీవోలా, క్రిస్టోఫర్ అబ్బాట్, రస్సెల్ క్రౌ తదితరులు ఇందులో కీలక పాత్రధారులు.